# మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం

- కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నాం
- 60 సంవత్సరాలు దాటిన వయోవృద్ధుల సంఘాల ఏర్పాటు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, గోవిందరావుపేట :** మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకురావడానికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నామని, కోటి మంది మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నామని, వయో వృద్ధులకు భరోసా కల్పించేందుకు 60 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ప్రత్యేక మహిళా సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం గోవిందరావుపేట మండలం పసర గ్రామంలో మంత్రి సీతక్క పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.10 లక్షల నిధులతో ఇందిరా మహిళా శక్తిలో భాగంగా గ్రామ సంఘాల భవనాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాల ఉన్నతికి తెలంగాణ ప్రగతి అనే లక్ష్యంతో మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తున్నామని ఈ పథకం ద్వారా అనేకమంది మహిళలు వివిధ వ్యాపార రంగాలలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మేడారం శ్రీ సమ్మక్క సారమ్మ మహా జాతరలో మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, వీటి ద్వారా వారికి రెట్టింపు ఆదాయం లభించిందన్నారు. మహిళలు స్వశక్తితో ఎదగడానికి వారికి సకాలంలో వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి ఆర్థిక అభివృద్ధికి పాటుపడడం జరుగుతుందని పేర్కొన్నారు. 60 సంవత్సరాలు నిండిన మహిళలకు కూడా ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేయడమే కాకుండా సంఘంలోని సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఆర్థిక బీమా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, డీఆర్ డీఓ శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యతతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం..

ఇందిరమ్మ ఇండ్లను నాణ్యతతో పూర్తిచేసి లబ్ధిదారులకు అందించే విధంగా సిద్ధం చేయాలని, జిల్లాలో వివిధ శాఖలలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. గురువారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క సారలమ్మ వన దేవతలను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., ఎస్ పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి సీతక్క దర్శించుకున్నారు. అనంతరం మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., ఎస్ పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రాలతో కలిసి మేడారంలోని హరిత హోటల్ లో మేడారం మాస్టర్ ప్లాన్, జంపన్న వాగు అభివృద్ధి పనులు, ఇందిరమ్మ నిర్మాణం, గోదావరి పుష్కరాల నిర్వహణ, వేసవికాలంలో తాగునీటి సరఫరా, సెంట్రల్ లైటింగ్, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, పలు అభివృద్ధి పనులపై జిల్లాస్థాయి అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ సునీత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, ఆర్డీఓ వెంకటేష్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## భద్రకాళిని దర్శించుకున్న అడవి శేషు

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని గురువారం సాయంకాలం ప్రముఖ చిత్ర నటుడు అడవి శేషు సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన అడవి శేషుకి ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. పూజానంతరం అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు.

– వరంగల్ వాయిస్, వరంగల్

# మెగా టెక్స్ టైల్‌ను సందర్శించిన కలెక్టర్

**వరంగల్ వాయిస్, గీసుగొండ :** వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం పలు శాఖల అధికారులతో కలిసి సందర్శించి, పార్క్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్‌లో రహదారుల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జ్ , బ్రిడ్జ్ పనులు, గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నుండి టెక్స్టైల్ పార్క్‌కు రహదారి మార్గం ఏర్పాటు, విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి తదితర మౌలిక సదుపాయాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, జిల్లా పరిశ్రమల మేనేజర్ స్వామి, ఆర్ & బి శాఖ అధికారులు, నేషనల్ హైవేస్ అథారిటీ ప్రతినిధులు, తహసీల్దార్లు రాజ్‌కుమార్, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

### ధర్మారం పాఠశాల సందర్శన..



జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం గీసుగొండ మండలంలోని ఎంపీపీఎస్ ధర్మారం పాఠశాలను సందర్శించారు. ఫౌండేషనల్ లీటరసీ, న్యూమరసీ కార్యక్రమం అమలు విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో అవసరమైన మూలాధార నైపుణ్యాలను పూర్తిగా సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నేర్చుకునే ప్రక్రియను ఆసక్తికరంగా మరియు ఫలప్రదంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రగతిని నిరంతరం ట్రాక్ చేస్తూ, అవసరమైన అకాడమిక్ సహాయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బి. రంగయ్య నాయుడు, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుజన్ తేజ మరియు ఎంఈఓ రవీందర్ పాల్గొన్నారు.




## వేసవికి సన్నద్ధంకండి

☐ ఎన్పీడీసీయల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాబోయే వేసవికి పూర్తి సన్నద్ధం అయ్యేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఎన్పీడీసియల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వేసవిలో చేపట్టాల్సిన విద్యుత్ పనుల పురోగతిపై హనుమకొండ, నక్కలగుట్ట విద్యుత్ భవన్ లో గురువారం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆపరేషన్ వింగ్, ఫైనాన్స్ వింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎండీ మాట్లాడుతూ జీఐఎస్ మ్యాపింగ్ అన్ని ఫీడర్లకు మార్చి నెలాకరు వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. పిడుగుల వలన ట్రాన్స్ ఫార్మర్ల దెబ్బతినకుండా ఉండేందుకు ఇప్పటివరకు 2,337 పిడుగుల నిరోధకాల పరికరాలను ఏర్పాటు చేశామని, మిగతా వాటిని మార్చి వరకు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఓవర్ లోడ్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచాలని కోరారు. రెవెన్యూ కలెక్షను 100 శాతం ఉండాలన్నారు. వర్క్ ఆర్డర్స్ పూర్తి చేయాలని ఆదేశించారు. పనిచేయని మీటర్లను మార్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫైనాన్స్ వి.తిరుపతి రెడ్డి, డైరెక్టర్ ఆపరేషన్ టి.మధుసూదన్, సీఈలు రాజు చౌహన్, అశోక్, శ్రవణ్ కుమార్ సీజీఎంలు రవీంద్రనాథ్, చరణ్ దాస్, కిషన్, జీఎంలు శ్రీనివాస్, కళాధర్ రెడ్డి , వేణు బాబు , జయరాజ్, కృష్ణ మనోహర్, వెంకట కృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కండక్టర్ బ్యాగులోని నగదు చోరీ

- చేతివాటం చూపిన దొంగలు
- ఆత్మకూరు సమీపంలో ఘటన

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో కండక్టర్‌ను బురిడీ కొట్టించి నగదు దోచుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. నర్సంపేట నుంచి ములుగు వెళ్తున్న బస్సులో రద్దీని ఆసరాగా చేసుకుని గుర్తుతెలియని వ్యక్తులు కండక్టర్ బ్యాగులోని సుమారు 6,000 రూపాయలను దొంగిలించారు. వివరాల్లోకి వెళ్తే.. నర్సంపేట నుంచి ములుగుకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు (నెంబర్: TS 03 Z 1086) లో కండక్టర్‌గా హరిలాల్ (స్టాఫ్ నెంబర్: 6582) విధులు నిర్వహిస్తున్నారు. బస్సు నర్సంపేట నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ప్రయాణికులకు టికెట్లు ఇస్తుండగా, గుర్తుతెలియని దొంగలు చాకచక్యంగా కండక్టర్ బ్యాగులోని నగదును తస్కరించారు. టికెట్ల అమ్మకం పూర్తయిన తర్వాత బ్యాగు చూడగా డబ్బులు లేకపోవడంతో కండక్టర్ షాక్‌కు గురయ్యారు. వెంటనే కండక్టర్ హరిలాల్, డ్రైవర్ కె.సురేందర్ బస్సును నిలిపివేసి ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఘటన జరిగిన సమయంలో బస్సులో సుమారు 120 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు వారు తెలిపారు. భారీ రద్దీని అదునుగా చూసుకునే దొంగలు ఈ చోరీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు.

## అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు సంబంధించిన జీఓ నంబర్ 252, జీఓ 103 సవరణలపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు పొడిగించనున్నట్లు ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ పిటిషన్‌లో, జీఓ 252, సవరించిన జీఓ 103 వల్ల జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలు, సదుపాయాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఫెడరేషన్ పేర్కొంది. పిటిషనర్ తరఫున ప్రముఖ న్యాయవాది అడ్వొకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరణ ఇస్తూ, జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా రెండు నెలల పాటు అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఈ మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రిడిటెడ్ జర్నలిస్టులు ప్రభుత్వ కార్యక్రమాలు, సౌకర్యాలను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించవచ్చని పేర్కొంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com